
సాక్షి అనంతపురం

శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



టన్ను చీనీ రూ.24 వేలు

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.24 వేల ప్రకారం విక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.10 ప్రకారం ధర పలికింది.



స్టేడియంలో యువత ఉత్సాహం



మ్యాచ్ దృశ్యాలను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న యువతులు

అక్షర్ అదరహో

- దులీప్ టోర్నీ మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శన

అనంతపురం: దులీప్ ట్రోఫీలో భాగంగా ఇండియా–సీ, ఇండియా–డీ జట్ల మధ్య టెస్ట్ మ్యాచ్ గురువారం అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌లో ప్రారంభమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఇండియా– డీ జట్టు తొలిరోజు ఫస్ట్ ఇన్నింగ్స్‌లో 164 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులో అక్షర్ పటేల్ (86 పరుగులు, 118 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్స్‌లు), అథర్వ తైడే (4), యశ్ దుబే (10), కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (9), దేవదత్ పడిక్కల్ (0), రికీ భుయ్ (4), శ్రీకర్ భరత్ (13) పరుగులు చేశారు. అక్షర్ సిక్సర్లు, ఫోర్లతో హోరెత్తించారు. ఇండియా– సీ బౌలర్లలో విజయ్ కుమార్ వైశాఖ్ (మూడు వికెట్లు), హిమాన్షు చౌహాన్, అన్షుల్ కాంబోజ్ చెరో రెండు వికెట్లు తీశారు. మానవ్ సుతార్, హృతిక్ షోకీన్ చెరో వికెట్ పడగొట్టారు.

91 పరుగులకు నాలుగు వికెట్లు

అనంతరం బ్యాటింగ్ చేసిన ఇండియా –సీ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లు కోల్పోయి 91 పరుగులు చేసింది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ 5 పరుగులకే పెవిలియన్ చేరాడు. సాయి సుదర్శన్ 7, ఏ. జుయల్ 12, ఆర్. పటిదార్ 13 పరుగులు చేసి అవుట్ అయ్యారు. ఇంద్రజిత్ (14 పరుగులు, ఏ. పోరెల్ (32 పరుగులు) క్రీజులో ఉన్నారు.

సందడే.. సందడి

హర్షధ్వానాలతో అనంతపురంలోని ఆర్డీటీ క్రీడా గ్రామం దద్దరిల్లింది. గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు హోరెత్తింది. దులీప్ ట్రోఫీ మ్యాచులకు అభిమానులు పోటెత్తారు. ఇండియా టీం–సీ, ఇండియా టీం– డీ మ్యాచ్ సందర్భంగా అభిమానులతో స్టేడియం కిక్కిరిసిపోయింది. టీమిండియా స్టార్ క్రికెటర్లను చూసి అభిమానులు కేరింతలు కొట్టారు. అక్షర్ పటేల్ మెరుపు ఇన్నింగ్స్ అభిమానులను కట్టి పడేసింది. భారీ సిక్సర్ బాది బాల్‌ను స్టేడియం బయటకు పంపిన సమయంలో అభిమానుల ఈలలు, కేకలతో స్టేడియం హోరెత్తింది. ఏసీఏ త్రీమెన్ కమిటీ సభ్యులు మాంఛో ఫెర్రర్, ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నే ఫెర్రర్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న మ్యాచ్‌ను పర్యవేక్షించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భద్రత చేపట్టారు.





బ్యాటింగ్ చేస్తున్న అక్షర్ పటేల్ (86 పరుగులు)

న్యూస్‌రీల్

బుగ్గ రామలింగేశ్వరున్ని తాకిన సూర్య కిరణాలు



తాడిపత్రి అర్బన్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన తాడిపత్రిలోని బుగ్గ రామలింగేశ్వరస్వామిని గురువారం సూర్యాస్తమయంలో సూర్య కిరణాలు తాకాయి. ఈ అద్భుతాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. స్వామి మూలవిరాట్‌ను సూర్య కిరణాలు తాకిన దృశ్యాన్ని వీక్షించి పులకించిపోయారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామి వారికి ప్రదోషకాల పూజలు నిర్వహించారు.

నిలిచిన శ్రీరామరెడ్డి, సత్యసాయి నీటి సరఫరా

కళ్యాణదుర్గం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రీరామరెడ్డి, సత్యసాయి పథకం కార్మికులు చేపట్టిన సమ్మెతో పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఫేజ్–01, 03, 04 కింద ఉన్న కూడేరు, బెళుగుప్ప, కళ్యాణదుర్గం, రాయదుర్గం, హిందూపురం, మడకశిర ప్రాంతాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. ఫేజ్–4 కింద కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో సుమారు 900 గ్రామాలకు నీటి సరఫరా ఆగిపోవడంతో గ్రామీణులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకంలో పనిచేసే 600 మందికి 7 నెలల వేతనం అందాల్సి ఉంది. సత్యసాయి తాగునీటి పథకంలో పనిచేసే సుమారు 300 మందికిపైగా కార్మికులకు 5 నెలల వేతనం అందాల్సి ఉందని అసోసియేషన్ నాయకుడు వన్నూరుస్వామి పేర్కొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతున్నా కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

10 నుంచి బ్యాడ్మింటన్ టోర్నీ

హిందూపురం టౌన్: హిందూపురంలోని దండు రోడ్డులో గల ఎస్‌పీఆర్ బ్యాడ్మింటన్ అకాడమీ ఇండోర్ స్టేడియం, మంజు బ్యాడ్మింటన్ అకాడమీలో ఈ నెల 10 నుంచి 13 వరకు అండర్–15 సబ్ జూనియర్ బాల, బాలికల బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అనంతపురం జిల్లా బ్యాడ్మింటన్ సమాఖ్య అధ్యక్షుడు బుగ్గయ్య చౌదరి, ఉపాధ్యక్షుడు డి.ఆర్. వెంకటేష్, షఫీ, కార్యదర్శి జయ కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్ష

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని సాంఘిక సంక్షేమ గురుకులాల్లో (అంబేడ్కర్ గురుకులాలు) 6,7,8 తరగతుల్లో అదనపు సీట్ల భర్తీకి గురువారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 41 బాలుర సీట్లకు గాను 561 దరఖాస్తులు రాగా 513 మంది పరీక్షకు హాజరయ్యారు. 62 బాలికల సీట్లకు గాను 650 దరఖాస్తులు రాగా 609 మంది బాలికలు హాజరయ్యారు. ఎంపికైన విద్యార్థుల జాబితాను డీసీఓ కార్యాలయం, గురుకుల పాఠశాలల్లోని నోటీస్‌బోర్డులో ఉంచినట్లు జిల్లా కోఆర్డినేటర్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలోని అదనపు సీట్లకు గతంలో రాసిన ప్రవేశ పరీక్ష ఆధారంగా మెరిట్ విద్యార్థులను ఎంపిక చేసి సమాచారం పంపామన్నారు. ఎంపికైన విద్యార్థులు ఈనెల 9లోగా ఆయా పాఠశాలల్లో అడ్మిషన్లు పొందాలన్నారు.

విద్యార్థిని బలిగొన్న నీటికుంట

- పాఠశాలలో మరుగుదొడ్లు లేక బయటకు వెళ్లి మృత్యువాత

బ్రహ్మసముద్రం/కళ్యాణదుర్గం: పాఠశాలలో మరుగుదొడ్లు లేక బహిర్భూమికి ఆరుబయటకు వెళ్లిన ఓ విద్యార్థి నీటికుంటలో పడి మృతి చెందాడు. ఈ ఘటన అనంతపురం జిల్లా బ్రహ్మసముద్రం మండలం రాయలదొడ్డి గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డి గ్రామానికి చెందిన రాయల్ తిమ్మారెడ్డి, త్రివేణిల పెద్ద కుమారుడు రాయల్ మణికంఠ (13) గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. రోజూ క్రమంలో భాగంగానే గురువారం ఉదయం పాఠశాలకు వెళ్లాడు. మధ్యాహ్నం భోజనం అనంతరం పాఠశాల సమీపంలోని ఓ వ్యవసాయ తోటలోకి బహిర్భూమికి వెళ్లాడు. నీటి కుంట వద్దకు వెళ్లగానే కాలుజారి కుంటలో పడిపోయాడు. అటుగా వెళ్లిన గ్రామస్తులు గమనించి బయటకు తీసేలోపే మణికంఠ విగత జీవుడిగా





నీటికుంటలో పడి మృతి చెందిన రాయల్ మణికంఠ, మాట్లాడుతున్న మాజీ ఎంపీ తలారి రంగయ్య

కనిపించాడు. దీంతో వారు విషయాన్ని విద్యార్థి తల్లిదండ్రులకు చేరవేయగా సంఘటనా స్థలానికి చేరుకున్న వారు గుండెలవిసేలా రోదించారు. చిన్న కుమారుడు రాయల్ బాబు అదే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు.

ప్రభుత్వ నిర్లక్ష్యమే విద్యార్థిని బలిగొంది..

విద్యార్థి నీటి కుంటలో పడిన విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త, మాజీ ఎంపీ డాక్టర్ తలారి రంగయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. విద్యార్థి మృతిపై ఆరా తీశారు. గతంలో తాను బాలల బీమా ప్రీమియం చెల్లించానని, విద్యార్థికి బీమా వర్తిస్తుందని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యమే విద్యార్థి మణికంఠ ప్రాణాలు బలిగొందని విమర్శించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సౌకర్యార్థం వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించిందన్నారు. అయితే ఆ మరుగుదొడ్లను కేవలం ఉపాధ్యాయులు మాత్రమే వినియోగించుకోవడం వల్ల విద్యార్థులు బహిర్భూమికి వ్యవసాయతోటలోకి వెళ్లాల్సిన దుస్థితి పట్టిందన్నారు. ఈ క్రమంలో బహిర్భూమికని వెళ్లిన మణికంఠ నీటి కుంటలో పడి మృతి చెందడం బాధాకరమన్నారు. కాగా, ఈ విషయాన్ని పక్కదారి పట్టిస్తూ విద్యార్థి పాఠశాలకు హాజరైనా రిజిస్టర్‌లో గైర్హాజరైనట్లు ఉపాధ్యాయులు దిద్దడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలకు ప్రహరీ లేకపోవడం, మరుగుదొడ్లు, ఇతర సమస్యలపై ఆయన నేరుగా కలెక్టర్ వినోద్‌కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రాయలదొడ్డిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చే ముద్దలాపురం విద్యార్థులు పాఠశాలకు రాకుండా టీడీపీ నాయకులు రోడ్డును దున్ని, కంపలు అడ్డుగా వేశారని, అధికారులు స్పందించి ఆ దారిని పునరుద్ధరించాలని కోరారు. మాజీ ఎంపీతో పాటు ఎంపీపీ చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు కరణం రాహుల్, రాయలదొడ్డి సర్పంచ్ పోట్ల రామ్మోహన్, ఉప సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు రాము, శంకర్ నాయక్, సునీల్, మాజీ సర్పంచ్ నరసింహులు, కిరీటి యాదవ్, జానీ, రాజు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అనుబంధ విభాగాల్లో చోటు



మీసాల రంగన్న



హరీష్ కుమార్ యాదవ్

అనంతపురం ఎడ్యుకేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగాల్లో జిల్లా నుంచి ఇద్దరికి చోటు కల్పిస్తూ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. రజక విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా సుగుమంచి రంగన్న (మీసాల రంగన్న), యాదవ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నాన్యంపల్లె హరీష్ కుమార్ యాదవ్‌ను నియమించారు. ఈ మేరకు గురువారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులను విడుదల చేసింది. రంగన్న, హరీష్‌కుమార్ మాట్లాడుతూ అప్పగించిన పదవులకు న్యాయం చేస్తామని తెలిపారు. కాగా, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన రంగేగౌడును వక్కళిగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా, పొగాకు రామచంద్రను వాల్మీకి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించారు.

గురువులది ఎప్పటికీ గొప్ప స్థానమే

- సమాజ మార్గదర్శకులు ఉపాధ్యాయులు
- జిల్లాస్థాయి గురు పూజోత్సవంలో ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల పంపిణీ

అనంతపురం ఎడ్యుకేషన్: సమాజంలో గురువులది ఎప్పటికీ గొప్ప స్థానమే అని వక్తలు కొనియాడారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో జిల్లాస్థాయి గురు పూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సమాజానికి గురువులు చేసిన కృషిని గుర్తు చేసుకుంటూ గురు పూజోత్సవం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సమాజానికి మార్గదర్శకంగా నిలిచిన గురువులకు పాదాభివందనం అన్నారు. బతకలేక బడి పంతులు అనే నానుడి నుంచి బతికితే బడిపంతుల్లా బతకాలనే స్థితికి తీసుకొచ్చిన ఘనత గురువులదేనన్నారు. ఎమ్మెల్సీ మంగమ్మ, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, కాలవ శ్రీనివాసులు, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గురువును మించిన దైవం లేదన్నారు. సమాజంలో గురువుల స్థానాన్ని ఎవరూ పూడ్చలేరన్నారు. రాజకీయాలకు అతీతంగా సమాజ హితం కోసమే



ఎంఈఓ వెంకటస్వామిని సన్మానిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, చిత్రంలో ఎంపీ అంబికా, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్సీ మంగమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి, డిప్యూటీ మేయర్ కోగటం తదితరులు

గురువులు పాటుపడాలని విజ్ఞప్తి చేశారు. పిల్లల్లో జ్ఞానాన్ని పెంపొందించి జీరో స్థానం నుంచి హీరో స్థానానికి తీసుకెళ్లేది గురువులేనన్నారు. వారు చెప్పిన విద్యాబుద్ధులతోనే ఏ రంగంలోనైనా పెద్ద స్థాయికి చేరుకుని సమాజంలో గౌరవంగా తిరుగుతున్నారని చెప్పారు.

గురువులు లేని ప్రపంచం లేదు

గురువులు లేకుండా ప్రపంచం లేదని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. ప్రతి టీచరూ వినూత్నంగా ఆలోచిస్తూ నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలన్నారు. పోటీ ప్రపంచానికి తగ్గట్టు విద్యార్థులను తీర్చిదిద్దాలని కోరారు. జిల్లాలో విద్య, ఉపాధి కోసం కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఎన్నికల విధుల్లో టీచర్లు కీలకంగా పని చేశారన్నారు. ఎక్కడా చిన్న పొరబాటుకు తావులేకుండా ప్రశాంతంగా నిర్వహించడం చాలా గర్వంగా ఉందన్నారు. చిత్తశుద్ధితో ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయాలని కోరారు. అనంతరం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పంపిణీ చేశారు. మెమెంటోలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ నాగరాజు, డీవైఈఓలు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి బాటలో ఆగిన ఊపిరి

రైలులో యువకుడి మృతి

- బిహార్ నుంచి బెంగళూరుకు అన్నాదమ్ముళ్ల పయనం
- విపరీతమైన రద్దీతో ఊపిరాడక తమ్ముడి కన్నుమూత

అనంతపురం సిటీ: ఉపాధి కోసం బిహార్ నుంచి బెంగళూరుకు రైలులో బయలుదేరిన ఓ యువకుడు విపరీతమైన రద్దీ కారణంగా ఊపిరి ఆడక గుండె ఆగి మరణించాడు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు.. అనంతపురం రైల్వే స్టేషన్లో మృతదేహాన్ని కిందకు దించేశారు. వివరాలు... బిహార్ రాష్ట్రం ముజఫర్‌పురలోని సరంచియ గ్రామానికి చెందిన రామ్‌క్రిపల్‌మాకు ఇద్దరు కుమారులు ఉన్నారు. కొన్నేళ్ల క్రితమే తండ్రి మృతి చెందడంతో కుమారులు బబ్లూకుమార్, గురుదేవ్‌కుమార్ కూలి పనులతో తమ తల్లిని పోషించుకుంటున్నారు. ఈ క్రమంలో కూలి పనుల కోసం కేకే ఎక్స్‌ప్రెస్‌లో న్యూఢిల్లీ నుంచి బెంగళూరుకు బయలుదేరారు. విపరీతమైన రద్దీ ఉన్న జనరల్ బోగీలోనే వారు ప్రయాణిస్తూ గురువారం తెల్లవారుజాము 5.30 గంటలకు గుంతకల్లు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. ఆ సమయంలో బబ్లూ కుమార్‌కు మెలకువ రావడంతో తన తమ్ముడిని నిద్ర లేపేందుకు ప్రయత్నించాడు. ఎంత లేపినా గురుదేవ్



రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాంపై తమ్ముని మృతదేహం వద్ద విచార వదనంతో అన్న బబ్లూకుమార్

కుమార్ (21) మేల్కొనకపోవడంతో తోటి ప్రయాణికులు గుర్తించి మృతి చెందినట్లుగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న రైల్వే అధికారులు ఉదయం 6.30 గంటలకు రైలు అనంతపురం రైల్వే స్టేషన్‌కు చేరుకోగానే గురుదేవ్‌కుమార్ మృతదేహాన్ని కిందకు దించే ప్రయత్నం చేశారు. అయితే విపరీతమైన రద్దీ కారణంగా సాధ్యం కాకపోవడంతో అత్యవసర ద్వారం నుంచి మృతదేహాన్ని ప్లాట్‌ఫాం పైకి చేర్చారు. విషయాన్ని బెంగళూరులో ఉన్న తమ మేనమామ, అతని స్నేహితులకు బబ్లూకుమార్ చేరవేయడంతో వారు అక్కడి నుంచి వచ్చారు. పోస్టుమార్టం అనంతరం శనివారం మృతదేహాన్ని అప్పగించనున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

ఒకేరోజు ఇద్దరికి పాముకాటు

రాయదుర్గం టౌన్: పాముకాటుతో ఒకే రోజు వేర్వేరు గ్రామాలకు చెందిన ఇద్దరు ఆస్పత్రి పాలయ్యారు. వివరాలు.. రాయదుర్గం మండలం చదం గొల్లలదొడ్డి నివాసి నాగమ్మ గురువారం ఉదయం ఇంటి వద్ద శుభ్రం చేస్తుండగా రక్తపింజరి పాము కాటు వేసింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను హుటాహుటిన రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. వైద్యుల పర్యవేక్షణలో మెరుగైన చికిత్స అందిస్తున్నారు. గుమ్మఘట్ట మండలం ఎర్రంపల్లి గ్రామానికి



చికిత్స పొందుతున్న నాగమ్మ

చెందిన మల్లికార్జున గురువారం ఉదయం తన గొర్రెలను మేపునకు సమీపంలోని అటవీ శివారు ప్రాంతానికి తోలుకెళ్లాడు. ఆ సమయంలో రక్తపింజరి ఆయన కాలును చుట్టేసింది. దాని బారి నుంచి బయటపడేందుకు ఆయన చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. గమనించిన తోటి కాపరులు వెంటనే ఆయనను కాపాడారు. ఈ క్రమంలో మల్లికార్జున కాలిపై రక్తపింజరి కాటేసింది. బాధితుడిని వెంటనే రాయదుర్గంలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.

విత్తనోత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

శింగనమల: విత్తనోత్పత్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేడీఏ ఉమామహేశ్వరమ్మ సూచించారు. శింగనమల మండలం తరిమెలలో గురువారం రైతులతో ఆమె సమావేశమై మాట్లాడారు. వరి సీడ్ బీపీటీ– 5204 విత్తనాన్ని పండిస్తే దిగుబడులను ఏపీసీడ్స్ వారు కొనుగోలు చేస్తారన్నారు. తరిమెల గ్రామంలో 75 క్వింటాళ్లు, కల్లుమడిలో 37.5 క్వింటాళ్ల వరి విత్తనాన్ని అందజేసినట్లు గుర్తు చేశారు. ఏడీఏ శైలజ, ఏఓ అన్వేష్‌కుమార్, శ్రీనివాస్, శంకర్‌లాల్ నాయక్, ఏఈఓ అక్కమ్మ, ఎంపీఈఓ ఆదినారాయణ, వీఏఏ నవీన్, రైతులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు 'పచ్చ' కామాంధుడిపై కేసు

శింగనమల: ఎట్టకేలకు టీడీపీకి చెందిన ఓ కామాంధుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మండలంలోని జూలకాల్వ గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీనివాసులు నాయుడు పలువురు మహిళా కూలీలను కొంతకాలంగా వేధిస్తున్నాడు. జూలకాల్వ పంచాయతీ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ తానేనని, ఉపాధి హామీ బిల్లులు పడాలంటే తన పక్కమీదకు రావాలంటూ అసభ్యంగా మాట్లాడేవాడు. దీనిపై 10 రోజుల క్రితం బాధిత మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, టీడీపీ నాయకుడు కావడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు. టీడీపీ మండల, నియోజకవర్గ స్థాయి నాయకుల ఒత్తిడితో తాత్సారం చేస్తూ వచ్చారు. ఈ క్రమంలో మహిళలు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఫోన్‌లో శ్రీనివాసులు మాట్లాడిన సంభాషణకు సంబంధించి వాయిస్ రికార్డులు వినిపించారు. దీంతో మండల పోలీసులు గురువారం కామాంధుడిపై కేసు నమోదు చేశారు.

సఫాయి కర్మచారీ వ్యవస్థను నిర్మూలించాలి

- కలెక్టర్ వి.వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: సఫాయి కర్మచారీ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి ఆ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మునిసిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులతో జిల్లా విజిలెన్స్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగర పాలక, పురపాలక సంఘాలు, పంచాయతీల్లో పారిశుధ్య సిబ్బంది కోసం ప్రత్యేకంగా వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. గతంలో సఫాయి పనులు చేసిన కర్మచారీలను గుర్తించి ఎలాంటి పరిహారం ఇవ్వాలో పరిశీలించాలని చెప్పారు. చట్టంపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇవ్వాలన్నారు. పథకాలకు అర్హులైన వారికి రుణాలను అందించాలన్నారు. అధికారులకు విజిలెన్స్ కమిటీ సభ్యులు సహకారం అందించాలని చెప్పారు. పారిశుధ్య సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న వేతనం వెంటనే చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యలను కమిటీ సభ్యులు పెన్నోబులేసు, రియాజ్‌బాషా, పద్మావతి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో ఆర్డీఓలు రాణిసుస్మిత, శ్రీనివాసులు రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్ రావు, బీసీ సంక్షేమ శాఖాధికారి ఖుష్బూకొఠారి, డ్వామా పీడీ వేణుగోపాల్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖాధికారి రామాంజనేయులు, ఎల్‌డీఎం నర్సింగరావు, సీఈఓ అశోక్‌కుమార్, నగర పాలక అదనపు కమిషనర్ శ్రీహరిబాబు,బీసీ కార్పొరేషన్ ఈడీ సుబ్రమణ్యం, సీపీఐ ప్రతాప్‌రెడ్డి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు షేకుంబి, మునిసిపల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



గంగినేపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: ప్రజలు నివాస ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. లేకపోతే అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉంటుందని వైద్య సిబ్బంది ప్రజలకు సూచించారు. గురువారం మండల పరిధిలోని గంగినేపల్లిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో బీపీ, షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారిని పరీక్షించి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ ప్రశాంత్ మాట్లాడుతూ.. రాత్రి సమయంలో దోమకాటుకు గురికాకుండా వేపాకు పొగ వేసుకోవాలని తెలిపారు. లేదా దోమతెరలను తప్పనిసరిగా వాడాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే ప్రభుత్వాసుపత్రికి వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకటనారాయణ, సీహెచ్‌ఓ ఐశ్వర్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఏఎన్‌ఎం కృష్ణవేణి, ఆశావర్కర్లు రాజేశ్వరి, పెద్ద రాజేశ్వరి, 104 సిబ్బంది సాయి కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అధ్యాపకురాలికి డాక్టరేట్



కృష్ణవేణి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలిగా పని చేస్తున్న జి.కృష్ణవేణి.. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. దాదాపు పదేళ్లకు పైగా స్థానిక కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో హిందీ అధ్యాపకురాలిగా పని చేసిన కృష్ణవేణి ఇటీవల ఉరవకొండ డిగ్రీ కళాశాలకు బదిలీ అయ్యారు. హిందీ విభాగంలో ఆచార్య కే.శ్రీకృష్ణ పర్యవేక్షణలో 'మెహరున్నీసా పర్వేజ్‌కి కహానియోమే నారీకే వివిధ్‌రూప్' అనే అంశంపై పరిశోధన చేసినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు రీసెర్చ్ సెల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ పి.సుధాకర్ తెలిపారు. కృష్ణవేణికి కేఎస్ఎన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శంకరయ్యతో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

'డిమాండ్లు నెరవేర్చే వరకూ సమ్మె విరమించం'



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

ఆత్మకూరు: కొన్ని నెలలుగా తమకు జీతాలు అందలేదంటూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు కార్మికులకు మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడతూ.. సత్యసాయి నీటి సరఫరా కార్మికులకు జీతాలతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ వెంటనే చెల్లించాలన్నారు. గతంలో సమ్మె చేసిన సమయంలో ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు విధానం రద్దు చేసి రెగ్యులర్ చేయాలన్నారు. కార్మికులకు రాజకీయ వేధింపులు లేకుండా చేయాలన్నారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి కార్మికులు ఓబన్న, చిన్న, రమేష్ రెడ్డి, శ్రీరాములు, మల్లి, సాయి ప్రసాద్, హరి,ఆంథొని, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

అనంతపురం రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయశ్రీ అన్నారు. గురువారం ఏ. నారాయణపురం–2 అంగన్‌వాడీ కేంద్రంలో ఈసీసీ డే నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకుంటేనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. రక్తహీనతను అధిగమిస్తే ప్రసవ సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదని పేర్కొన్నారు. ఆకుకూరలు, కోడి గుడ్లు, పండ్లు తరచూ తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్య ఉంటుందని.. మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని సూచించారు. ప్రభుత్వం అందించే పాలు, కోడిగుడ్లు, పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మన్న, ఏఎన్ఎం మీనాక్షి, అంగన్‌వాడీ కార్యకర్తలు కౌసర్ బాను, లావణ్య, ముంతాజ్, రామాంజినమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆచార్య దేవోభవ

- ఘనంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ వసీం, తదితరులు

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం, జేఎన్‌టీయూ అనంతపురం, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి ఘనంగా నిర్వహించారు. జేఎన్‌టీయూ అనంతపురంలో ఉత్తమ అధ్యాపక పురస్కారాలను అందజేశారు. జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో ఎంపిక చేసిన ప్రొఫెసర్లకు ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ హెచ్. సుదర్శన రావు ఉత్తమ అధ్యాపక అవార్డులను అందజేసి, సత్కరించారు.

జేఎన్‌టీయూ టీచర్స్ అవార్డ్స్ గ్రహీతలు: (యూనివర్సిటీ స్థాయిలో)..

ప్రొఫెసర్ ఎస్. కృష్ణయ్య (సివిల్ ఇంజినీరింగ్ విభాగం), రిజిస్ట్రార్, ప్రొఫెసర్ వి. సుమలత (ఈసీఈ విభాగం), ప్రొఫెసర్ కే. త్యాగరాజన్ (ఫిజిక్స్, కలికిరి కళాశాల), ప్రొఫెసర్ కే. జయలక్ష్మి (మేథమేటిక్స్, జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల), డాక్టర్ ఎం. కళ్యాణ్ కుమార్ (కెమికల్, జేఎన్‌టీయూ క్యాంపస్ కళాశాల),

అటామనస్ కళాశాలల కేటగిరిలో ఉత్తమ టీచర్లు: డాక్టర్ ఎన్. కాశి విశ్వనాథ్ (పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల, కర్నూలు), డాక్టర్ కే. సోమశేఖర్ రెడ్డి (రైపర్ కళాశాల, అనంతపురం), డాక్టర్ డి. మాధురి (క్రియేటివ్ ఎడ్యుకేషనల్ సొసైటీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, కర్నూలు)

ప్రిన్సిపాల్స్ కేటగిరీలో..

డాక్టర్ నవీన్ (వేము ,చిత్తూరు), డాక్టర్ సి. మధుసూదన్ శెట్టి (శాంతిరాం ఫార్మసీ, నంద్యాల), డాక్టర్ డి. రంగనాయకులు (పద్మావతి ఫార్మసీ, తిరుపతి), డాక్టర్ డి.జే. సమతానాయుడు (అన్నమాచార్య పీజీ కళాశాల, రాజంపేట)

ఉత్తమ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్..

ప్రొఫెసర్ కే. శేష మహేశ్వరమ్మ (కెమిస్ట్రీ, జేఎన్‌టీయూ పులివెందుల), సురేష్ బాబు (కేఎస్ఆర్ఎం. కడప)

వర్సిటీ ఉత్తమ ప్రోగ్రాం ఆఫీసర్లు

వడిత్యా అశోక్‌నాయక్, కలికిరి, బల్లి నిరీశా (గీతాంజలి , నెల్లూరు)

వర్సిటీ పేటెంట్ అవార్డులు..

ప్రొఫెసర్ హెచ్. సుదర్శనరావు (సివిల్ ఇంజినీరింగ్), డాక్టర్ వైశాలి గోర్పడే (సివిల్ ఇంజినీరింగ్), ప్రొఫెసర్ సి. శశిధర్ (సివిల్ ఇంజినీరింగ్), డాక్టర్ ఎస్. అరుణా మస్తాని , అసోసియేట్ ప్రొఫెసర్, జేఎన్‌టీయూ ,అనంతపురం, డాక్టర్ ఎం. మురళీ నాయక్ , అడ్‌హాక్ అసిస్టెంట్ ప్రొఫెసర్, కెమికల్, ప్రొఫెసర్ ఎన్. విశాలి , ఈఈఈ విభాగం, జేఎన్‌టీయూ అనంతపురం. ఎస్కేయూలో గతేడాది రాష్ట్ర ఉత్తమ ప్రొఫెసర్ అవార్డు దక్కించుకున్న ప్రొఫెసర్ కే. రాంగోపాల్ (ఫిజిక్స్), ప్రొఫెసర్ జీవీ రమణ (సోషియాలజీ)లను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత సత్కరించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, అనంతపురంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ప్రిన్సిపాల్ సి.జయచంద్రా రెడ్డి తదితరులు నివాళులర్పించారు.

అనంతపురం ఎడ్యుకేషన్/అనంతపురం కార్పొరేషన్/అనంతపురం రూరల్/రాప్తాడు/ఆత్మకూరు: నగరపాలక సంస్థ కార్యాలయంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి మేయర్ వసీం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వర్లు, కార్యదర్శి సంగం శ్రీనివాసులు, ఏసీపీ మారుతీహరిప్రసాద్, ఎంహెచ్ఓ డాక్టర్ విష్ణుమూర్తి, కార్పొరేటర్లు బాలాంజినేయులు, కమల్ భూషణ్, నాయకులు కాకర్ల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రైవేట్ స్కూళ్లలో గురుపూజోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కళ్యాణదుర్గం రోడ్డులోని సెయింటాన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ప్రిన్సిపల్ సిస్టర్ సెల్వామేరీ ఆధ్వర్యంలో సర్వేపల్లి చిత్రపటానికి నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. రాప్తాడు మండలం హంపాపురం సమీపంలోని ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో గురుపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా కళాశాలలో మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్వీఐటీ కళాశాల ఎండీ వెన్నపూస రమాకాంత్ రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ విష్ణువర్ధన్, ఏఓ శివా రెడ్డి పాల్గొన్నారు. ఆత్మకూరులోని కేజీబీవీలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లీమారోజ్ తదితరులు పాల్గొన్నారు. రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు.



అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో న్యూటౌన్ బాలుర పాఠశాల ఎస్‌ఏ మహమ్మద్ రఫీని సన్మానిస్తున్న దృశ్యం, చిత్రంలో కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎంపీ అంబికా, తదితరులు



రాప్తాడు: ఎస్వీఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో రాధాకృష్ణన్ జయంతి



ఆత్మకూరు కేజీబీవీలో కేక్ కట్ చేస్తున్న విద్యార్థినులు, ఉపాధ్యాయులు



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి



ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీతలతో జేఎన్‌టీయూ ఇన్‌చార్జ్ వీసీ సుదర్శనరావు

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

చెన్నేకొత్తపల్లి: వినాయక చవితి పండుగ పురస్కరించుకుని వినాయక మంటపాలను ఏర్పాటు చేసుకునే వారి కోసం ప్రత్యేకంగా సింగిల్ విండో క్లియరెన్స్ విధానం తీసుకొచ్చినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక మంటపాలు ఏర్పాటుకు అగ్నిమాపక, విద్యుత్, గ్రామ పంచాయతీ, పోలీసు శాఖల నుంచి నిరభ్యంతర ప్రతం తీసుకోవాల్సి ఉంటుందన్నారు. నిరభ్యంతర పత్రం కోసం అధికారుల చుట్టూ తిరగకుండా ప్రభుత్వం సింగిల్ విండో క్లియరెన్స్ విధానం రూపొందించిందన్నారు. 7995095800 అనే నంబర్‌కు వాట్సాప్ ద్వారా హాయ్ అని మెసేజ్ పంపాలన్నారు. వెంటనే వినాయక మంటపాల ఏర్పాటుకు సంబంధించిన విధి విధానాలు వస్తాయని పేర్కొన్నారు. వివరాలను నమోదు చేసిన అనంతరం అధికారులు వాటిని పరిశీలించి నిరభ్యంతర పత్రం అందజేస్తారన్నారు.

8న రెడ్డి వివాహ పరిచయ వేదిక

రాప్తాడురూరల్: రాయలసీమ రెడ్డి జన సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8న ఉదయం 10 నుంచి 12:30 గంటల వరకు 'రెడ్డి వివాహ పరిచయ వేదిక' ఏర్పాటు చేస్తున్నట్లు సంఘం వ్యవస్థాపకుడు రొద్దం సురేష్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని (బీఎస్ఎన్ఎల్ టవర్ వెనుక) సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసే వివాహ పరిచయ వేదికలో పెళ్లికాని యువతీ యువకుల బయోడేటాతో తల్లిదండ్రులు సంప్రదించాలని కోరారు. ఉచిత వేదికను రెడ్డి కులస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 94415 75641, 93902 84296 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చాలి

ఆత్మకూరు: మండల వ్యాప్తంగా మూడు సంవత్సరాల్లోపు వయస్సు ఉన్న చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీవాణి తెలిపారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఆటపాటలతో విద్యాబోధన చేస్తామన్నారు. రుచికరమైన పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. అనంతరం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'విద్యుత్ తీగలను సరిచేశారు'



విద్యుత్ తీగలపై ఉన్న కొమ్మలను కొట్టేస్తున్న ట్రాన్స్‌కో సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

ఆత్మకూరు: మండల కేంద్రంలోని వన్నూర్ స్వామి దర్గా సమీపంలో విద్యుత్ తీగలపై చెట్టు కొమ్మలు పడి ప్రమాదకరంగా మారింది. ఈ విషయంపై ఈనెల 4వ తేదీన సాక్షి దినపత్రికలో పట్టించుకోకపోతే ప్రమాదమే అనే శీర్షికతో కథనం వెలువడింది. స్పందించిన ట్రాన్స్‌కో సిబ్బంది గురువారం విద్యుత్ తీగలపై పడిన కొమ్మలను తొలగించారు. చెట్టు కొమ్మలను తొలగించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

జ్వర పీడితులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు

అనంతపురం మెడికల్: జ్వర పీడితులపై ప్రత్యేక దృష్టిసారించాలి. విష జ్వరాలతో వచ్చిన రోగులను సకాలంలో చూసి, అవసరమైతే వారిని వార్డులకు తరలించేలా చూడాలని ఎమర్జెన్సీ మెడిసిన్ విభాగం హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులకు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు సూచించారు. గురువారం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులతో సూపరింటెండెంట్ సమావేశమయ్యారు. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఏమైనా కొరత ఉంటే తక్షణం తమ దృష్టికి తీసుకురావాలన్నారు. రానున్న రోజుల్లో ఎమర్జెన్సీ మెడిసిన్‌లో మరిన్ని సౌకర్యాలను మెరుగుపరుస్తామని తెలిపారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో మొత్తం 84 మంది జ్వరంతో బాధపడుతున్న వారు అడ్మిషన్‌లో ఉన్నారన్నారు. అందులో చిన్నపిల్లల వార్డులో 44, మెడిసిన్‌లో 40 మంది ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా ఎమర్జెన్సీ మెడిసిన్‌కు వచ్చే క్షతగాత్రులు, పాయిజన్, పాముకాటు, తదితర కేసులను సకాలంలో ఏఎంసీ తదితర వార్డులకు పంపాలన్నారు.

ఉపాధ్యాయ సంఘాల నాయకులకు అవమానం

అనంతపురం ఎడ్యుకేషన్: విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాల డ్రామా హాలులో నిర్వహించిన 'జిల్లా స్థాయి గురు పూజోత్సవ' వేడుకల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులకు అవమానం జరిగింది. ఏటా వేదికకు ఎదురుగా ఓ వైపు రెండు, మూడు వరుసల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులకు సీట్లు కేటాయించే వారు. ప్రతి సంఘం నుంచి ఒకరిని వేదిక పైకి పిలిపించి మాట్లాడే అవకాశం కల్పించే వారు. ఈసారి మాట్లాడించడం పక్కన పెడితే కనీసం కూర్చునేందుకు కూడా సీట్లు కేటాయించకపోవడం దారుణం. పిలవని పేరంటానికి వెళ్లినట్లు ఓ ముగ్గురు నాయకులు వేదికపైకి వెళ్లారు. వారిని పట్టించుకునే నాథుడే లేక పోయాడు. ఒక కుర్చీ ఖాళీగా ఉంటే ఒక నాయకుడు కూర్చోగా, తక్కిన ఇద్దరు వేదిక వెనుకపై నిలబడుకున్నారు. వచ్చిన అతిథుల వెనుక నిలబడి ఫొటోల్లో కనిపించేందుకు ఆ నాయకులు పోటీ పడ్డారు. చాలామంది ఉపాధ్యాయ సంఘాల నాయకులు వెనుక వైపు ఎక్కడ ఖాళీగా ఉంటే అక్కడ కుర్చీల్లో కనిపించగా.. మరికొందరు ఖాళీ కుర్చీలు లేక బయట బయట తిరుగుతూ కనిపించారు. కొత్త ప్రభుత్వం వచ్చిన తర్వాత అవార్డుల ఎంపికలోనూ (నిబంధనలకు విరుద్ధంగా) కొత్త సంప్రదాయానికి తెర తీసిన విద్యాశాఖ అధికారులు, వేడుకల్లో ఉపాధ్యాయ సంఘాల నాయకులకూ అగౌరపరిచేలా వ్యవహరించి అదే కొత్త సంప్రదాయానికి తెర తీశారంటూ పలువురు నేతలు వాపోయారు.

బంగారు నగల అపహరణ

తాడిపత్రి అర్బన్: తాళం వేసిన ఇంట్లోకి చొరబడి విలువైన బంగారు నగలను అపహరించుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... తాడిపత్రిలోని శ్రీనివాసపురంలో నివాసముంటున్న పుల్లమ్మ నాలుగు నెలల క్రితం ఇంటికి తాళం వేసి మిద్దెపైకి వెళ్లి ఒంటిరిగా నిద్రించింది. విషయాన్ని గుర్తించిన దుండగులు అర్ధరాత్రి సమయంలో ఇంట్లోకి చొరబడి 6 తులాల బంగారు నగలను అపహరించుకెళ్లారు. తెల్లవారిన తర్వాత చోరీ విషయాన్ని గుర్తించినా... అప్పటికే తన భర్త విజయ్‌కుమార్‌రెడ్డి ప్రమాదానికి గురైన విషయం తెలుసుకుని హడావుడిగా ఆస్పత్రికి చేరుకుంది. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు భర్తను హైదరాబాద్‌కి తీసుకెళ్లి అక్కడి ఆస్పత్రిలో అడ్మిట్ చేయించింది. సీఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మట్టి వినాయకా.. మనసా స్మరామి



మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న లాల్‌బాషా

అనంతపురం కల్చరల్: వినాయక చవితి ఉత్సాహం వాడవాడలా వెల్లివిరుస్తోంది. పర్యావరణ హితమే లక్ష్యంగా అనేక స్వచ్ఛంద సంస్థలు, దేవస్థానాల ప్రతినిధులు గురువారం మట్టి వినాయకులను ఉచితంగా అందించారు. స్థానిక పాతూరు దత్తాత్రేయస్వామి దేవస్థానంలో అప్పా సుధీర్ నేతృత్వంలో వందలాది మందికి మట్టి వినాయకులు అందజేశారు. ఆదరణ సేవా సమాజ్ అధ్యక్షుడు లాల్‌బాషా మతసామరస్యాన్ని చాటుతూ పలుచోట్ల విద్యార్థులకు మట్టి గణపతులు అందించారు. సక్షం ఆధ్వర్యంలో స్థానిక కోవూర్ నగర్‌లో వేణుగోపాల్, మల్లికార్జున అధ్యక్షతన దివ్యాంగులకు మట్టి గణపతుల పంపిణీ సాగింది. గోవింద భజన మండలి వారి ఆధ్వర్యంలో పాతూరులో జరిగిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు తిరువీధుల జగదీష్, శబరి వరప్రసాద్, ఈరంకి రమణ తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయకుల తయారీ..

అనంతపురం ఎడ్యుకేషన్: పకృతిని పరిరక్షించే దిశగా అడుగులు వేసిన నగరంలోని మాంటిస్సోరి పాఠశాలల విద్యార్థులు గురువారం మట్టి వినాయకులను తయారు చేశారు. వివిధ ప్రాంతాల్లో వాటిని పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టి మట్టి గణపతుల ఆవశ్యకతను తెలియజేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ.. ప్రకృతి హితమే పండుగల పరమార్థమన్నారు. అందరూ మట్టి గణపతులను పూజించాలని కోరారు. కార్యక్రమంలో మాంటిస్సోరి పాఠశాలల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాళ్లు ఎ.రమాదేవి, కె.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు మట్టి గణపతుల పంపిణీ

అనంతపురం కల్చరల్: నగరంలోని పలు చోట్ల శుక్రవారం మట్టి గణపతులను ఉచితంగా అందిస్తున్నారు. స్థానిక మొదటి రోడ్డులోని సర్కిల్‌లో ఉదయం 11 గంటలకు వైఎస్సార్‌సీపీ నాయకుడు అనిల్ కుమార్ నేతృత్వంలో మట్టి గణపతుల పంపిణీ ఉంటుంది. స్థానిక హెచ్చెల్సీ కాలనీలోని నసనకోట ముత్యాలమ్మ ఆలయంలో ఉదయం 10 గంటలకు 50వ డివిజన్ కార్పొరేటర్ శేఖరబాబు నేతృత్వంలో మట్టి గణపతులు అందజేస్తారు. రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యాలయమైన కోర్టు రోడ్డు శివకృపలో ఉదయం 9 గంటల నుంచే మట్టి గణపతుల పంపిణీ ప్రారంభం కానుంది. అలాగే సక్షం సంస్థ ఆధ్వర్యంలో స్థానిక విద్యారణ్య పాఠశాల ప్రాంగణంలో మట్టిగణపతులను ఉచితంగా అందిస్తారు. స్థానిక జిల్లా కోర్టు ప్రాంగణంలో సాయంత్రం 5 గంటలకు ఉచిత మట్టి గణపతుల పంపిణీ సాగుతుంది.

ఎరువుల సమస్య తలెత్తరాదు



మాట్లాడుతున్న జేడీఏ ఉమామహేశ్వరమ్మ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ఎరువుల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో రేక్ ఆఫీసర్ ఎం.రవి, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పెన్నేశ్వరితో పాటు ఎరువుల కంపెనీ ప్రతినిధులతో ఆమె సమావేశమై మాట్లాడారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు గాను అన్ని రకాల ఎరువులు 1,11,854 మెట్రిక్ టన్నులు కేటాయించగా... అంతకు మించి 1,24,865 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. ఇందులో యూరియా 35,467 మెట్రిక్ టన్నులు, డీఏపీ 17,145 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ 10,743 మెట్రిక్ టన్నులు, ఎస్ఎస్‌పీ 6,575 మెట్రిక్ టన్నులు, అత్యధికంగా 54,789 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు ఉన్నాయన్నారు. వరి నాట్లు, రబీ ప్రారంభయ్యే అవకాశం ఉన్నందున ఈ నెలలో డీఏపీ, యూరియా అవసరమైనంత సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి సమస్య ఉత్పన్నం కాకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఎల్ఐసీ సేవలు వినియోగించుకోండి



ర్యాలీలో పాల్గొన్న ఎల్ఐసీ బ్రాంచ్–2 మేనేజర్లు, ఏజెంట్లు, స్టాఫ్

అనంతపురం అగ్రికల్చర్: ఎల్ఐసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలని బ్రాంచ్–2 మేనేజర్ జి.భరత్, అసిస్టెంట్ మేనేజర్ మమత తెలిపారు. ఎల్ఐసీ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం స్థానిక బ్రాంచ్–2 కార్యాలయం నుంచి సప్తగిరి సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. దేశంలో కోట్లాది మందికి వివిధ రకాల ఆకర్షణీయమైన పాలసీలతో ఎల్ఐసీ పొదుపు సేవలు అందిస్తోందన్నారు. అలాగే వివిధ రంగాల అభివృద్ధికి రుణసదుపాయం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. సామాజిక సేవా కార్యక్రమాలు కూడా కొనసాగిస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సంఘం నాయకులు చెరకుతోట నగేష్, ఏజెంట్స్ ఆదిశేషయ్య, వెంకట నారాయణ, వన్నూర్ వలీ, రామముని, సాయి, మారుతి, స్టాఫ్ నాగరాజు, వెంకటేష్, రతన్‌లాల్, రొద్దం హరి, ఉషారాణి, సత్యవతి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

హెల్త్‌క్లినిక్‌లు అందుబాటులోకి తేవాలి



డీఆర్ఓ రామకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

అనంతపురం అర్బన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అనుమతులు లభించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ల (ఆరోగ్య కేంద్రాలు) నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని డీఆర్ఓ జి.రామకృష్ణారెడ్డికి ఏఐవైఎఫ్ నాయకులు విన్నవించారు. డీఆర్ఓని గురువారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, తదితరులు కలిసి వినతిపత్రం అందజేసి పరిస్థితి వివరించారు. జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో నిర్మాణ దశలో ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పనులు తిరిగి ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయిలో ఆరోగ్య కేంద్రాల ఏర్పాటుతో స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అయితే అధికారులు వీటి విషయంలో నిర్లక్ష్య ధోరణితో ఉన్నారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అనుమతులు లభించిన వాటిని పూర్తిస్థాయిలో నిర్మించి వాటి ద్వారా ప్రజలకు వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట్రేష్, శ్రీనివాసులు, మోదీన్‌బాషా, అభి, దివాకర్, హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.